# సాక్షి నిజామాబాద్

సోమవారం : 25 : ఆగస్టు : 2025






### గాంధీ పేరును చోరీ చేసింది..

రాహుల్‌గాంధీ ఓట్ చోరీ అంటూ డ్రామాలు చేస్తున్నారని, గాంధీ పేరును చోరీ చేసింది సోనియా కుటుంబమేనని ధన్‌పాల్ అన్నారు.

- 8లో ▸



### జెండా బాలాజీ ఉత్సవాలు..

జెండా బాలాజీ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 15 రోజుల పాటు జాతర కొనసాగనుంది.

- 8లో ▸

### వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.4 /21.8

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. మధ్యాహ్నం తరువాత ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్



**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, అడ్మిషన్స్ కన్వీనర్ టీజీఎస్‌సెట్–2025 ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26, 28, 29వ తేదీల్లో అర్హులైన అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్స్ ఇవ్వనున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), కంప్యూటర్ సైన్స్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), కంప్యూటర్ సైన్స్ (డాటా సైన్స్) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందొచ్చని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కౌన్సెలింగ్‌లో సీట్లు అలాట్ అయినవారు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనరాదని స్పష్టం చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటా నిబంధనలు స్పాట్ అడ్మిషన్స్‌కు వర్తించవని ప్రిన్సిపాల్ తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac.inను సంప్రదించాలని సూచించారు.

### స్టాఫ్‌నర్సుల జాబితాలో గందరగోళం

**నిజామాబాద్‌నాగారం:** వైద్య, ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సుల సెలక్షన్ జాబితా గందరగోళంగా మారింది. 1:2 జాబితాను ఈ నెల 23న శాఖ వెబ్‌సైట్‌లో పెట్టారు. 30 పోస్టులకు గాను 60మంది పేర్లను పెట్టారు. అయితే 60 మంది జాబితాలో 13మంది పేర్లు రెండేసి సార్లు రావడంతో అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. 30 పోస్టులకు వందలాది దరఖాస్తులు వచ్చాయి. సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఐదుగురిని నియమించారు. అయినా జాబితాలో మాత్రం 13మంది పేర్లను రెండేసి సార్లు రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 26న ఆర్డర్ కాపీలు ఇవ్వాల్సి ఉంది.

### నేటి నుంచి యాంత్రీకరణ దరఖాస్తుల స్వీకరణ

- రైతు వేదికల్లో స్వీకరించనున్న అధికారులు

**డొంకేశ్వర్(ఆర్మూర్):** యాంత్రీకరణ పథకం కింద రాయితీపై వ్యవసాయ పనిముట్ల కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైతు వేదికల్లో సోమవారం నుంచి వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాకు 6,742 యూనిట్లు మంజూరు కాగా మొదటి విడతగా రూ.1.67కోట్లు మంజూరయ్యాయని, మొత్తం 11రకాల వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు, మహిళలకు 50శాతం, పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీ ఉందని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ అందజేయాలని సూచించారు. గతంలో లబ్ధి పొందని రైతులకు ప్రాధాన్యత ఉంటుందని, లబ్ధిదారుల ఎంపిక తర్వాత పరికరాలు సరఫరా చేసే కంపెనీ పేరుపై రైతులు డీడీ తీయాల్సి ఉంటుందని తెలిపారు.

## నార్త్ గ్యాంగ్‌ల హల్‌చల్



యూపీ, ఢిల్లీ, హర్యానా.. వేల కిలో మీటర్ల దూరంలోని ఆయా రాష్ట్రాల నుంచి వస్తున్న దొంగలు దడ పుట్టిస్తున్నారు. వేల కిలోమీటర్ల ప్రయాణం.. వస్తూ వస్తూ వాహనాల దొంగతనాలు.. ఆ వాహనాల్లోనే తిరుగుతూ ఏటీఎంలు, ఇళ్లను కొల్లగొడుతున్నారు. పని పూర్తి కాగానే వాహనాలను ఎక్కడో ఓ చోట వదిలేసి సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.



చంద్రశేఖర్ కాలనీలో గ్యాస్ కట్టర్‌తో ధ్వంసం చేసిన ఏటీఎం (ఫైల్)

- జిల్లా వాసుల్లో దడ పుట్టిస్తున్న గ్యాంగ్‌లు
- ఏటీఎంలు కొల్లగొడుతున్న ముఠాలు
- బ్యాంకులను టార్గెట్ చేస్తున్న యూపీ చోరులు
- చోరీ వాహనాలు మహారాష్ట్ర, కర్ణాటకకు..

**ఖలీల్‌వాడి:** జిల్లాలో జరుగుతున్న వరుస దోపిడీ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పలు కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని అరెస్టు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఉత్తర భారతదేశంలోని ఉత్తర ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ ప్రాంతాల నుంచి వచ్చి పక్కా స్కెచ్‌తో దోపిడీలకు పాల్పడుతుండగా, నేరస్తులు పట్టుబడకపోవడంతో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

#### మహారాష్ట్ర నుంచి చెడ్డీ గ్యాంగ్..

మహారాష్ట్రకు చెందిన చెడ్డీ గ్యాంగ్ పేరు వింటేనే హడల్. ఒంటిపై చొక్కా, కాళ్లకి చెప్పులు లేకుండా చెడ్డీలు ధరించి ఒంటికి నూనె రాసుకొని, చేతిలో రాడ్లు పట్టుకుని చోరీలు చేస్తుంటారు. నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్, ముబారక్‌నగర్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఆరు సంవత్సరాల్లో ఆరు దొంగతనాలు చేయగా రెండు కేసులను పోలీసులు ఛేదించారు. ఏడాదిన్నర క్రితం నగరంలోని మూడో పోలీస్‌స్టేషన్ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ కదలికలను గుర్తించారు. ఆ తరువాత గ్యాంగ్ మళ్లీ జిల్లాలో కనిపించలేదు.

**బ్యాంక్‌లు, సెల్‌ఫోన్ టవర్లు.. యూపీ ముఠాల టార్గెట్**

మూడేళ్ల క్రితం మెండోరా మండలం బుస్సాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో యూపీకి చెందిన ముఠా దోపిడీకి పాల్పడింది. గ్యాస్‌కట్టర్‌తో షట్టర్‌ను తొలగించి 8 కిలోల 300 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లింది. రూ.7.30 లక్షల నగదు కాలిపోయింది. ఇప్పటి వరకు ఈ ముఠా సభ్యుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి కొంత బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జక్రాన్‌పల్లి ప్రాంతంలోని సెల్ టవర్‌కు సంబంధించిన విలువైన సామగ్రిని యూపీ ముఠా ఎత్తుకెళ్లింది. ఢిల్లీ ప్రాంతంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

**ఇక్కడి వాహనాలు ఆ రాష్ట్రాలకు..**

పొరుగునే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ముఠాలతోపాటు జిల్లాకు చెందిన ముఠాలు బైక్‌లు, కార్లు, ఆటోలను చోరీలకు పాల్పడుతున్నాయి. ఇక్కడి వాహనాలను కర్ణాటక, మహారాష్ట్రకు తరలించి అక్కడ స్పేర్‌పార్ట్‌లుగా విడగొట్టి విక్రయిస్తున్నారు. జిల్లాకు చెందిన బైక్ దొంగల ముఠాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

#### ఇనుప సామగ్రినీ వదలరు

మహారాష్ట్రలోని నాగ్‌పూర్, నాందేడ్ ప్రాంతాలకు చెందిన వారు ఇనుప సామగ్రినీ మాయం చేస్తున్నారు. విద్యుత్ నియంత్రికల్లోని కాపర్ కాయిల్స్ దోచుకెళ్లిన ఘటనలు అనేకం ఉన్నాయి. వాటిని స్క్రాప్ కింద మార్చి ముంబై, ఢిల్లీ, గుజరాత్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



నిజామాబాద్ ఐదో టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ద్విచక్ర వాహనాల దొంగలు (ఫైల్)

#### ఏటీఎంలలో హర్యానా ముఠాలు..

జాతీయ రహదారి వెంట ఉన్న ఏటీఎంలలో దోపిడీ చేయడం హర్యానా ముఠాల ప్రత్యేకత. నాలుగు రోజుల క్రితం నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్‌కాలనీ చౌరస్తాలో ఏటీఎంలో చోరీకి యత్నించారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేశారు. పోలీసులు వెంబడించడంతో వాహనాన్ని వదిలేసి పరారయ్యారు. అదే రోజు ఆర్మూర్‌లోని ఏటీఎంను కొల్లగొట్టేందుకు ఇదే ముఠా ప్రయత్నించినట్లు తెలుస్తోంది. వారం రోజుల క్రితం నవీపేట్‌లోని ఏటీఎంలో చోరీకి ఓ గ్యాంగ్ ప్రయత్నించింది. ఈ మూడు ప్రాంతాల్లో ఏటీఎంలలో చోరీకి యత్నించింది ఒకే ముఠా అని పోలీసులు భావిస్తున్నారు. దుండగులను పట్టుకునేందుకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడ్డారు. దుండగులు మహారాష్ట్రలోని లాతూర్‌లో మారుతీ వ్యాన్‌ను చోరీ చేసి అందులోని వచ్చినట్లు గుర్తించారు. పాత నేరస్తుల పనేనని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా కేంద్రంలో ఇటీవల ఏటీఎం చోరీకి దుండగులు ఉపయోగించిన మారుతీ వ్యాన్(ఫైల్)

## తేలిన పంటల సాగు లెక్క

- 5,24,506 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు..
- గతేడాదితో పోలిస్తే జిల్లాలో కొంతమేర పెరిగిన వరి సాగు విస్తీర్ణం

**డొంకేశ్వర్(ఆర్మూర్):** వానాకాలం సీజన్‌లో సాగవుతున్న పంటల లెక్క తేలింది. జిల్లాలో మొత్తం 5,24,506 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఆగస్టు రెండో వారంతో వరినాట్లు పూర్తి కావడంతో పంటల సాగు విస్తీర్ణంపై అధికారులకు స్పష్టత వచ్చింది. అయితే గతేడాది వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది కొన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. వరి, పసుపు, పెసర విస్తీర్ణం మాత్రమే కొంత మేర పెరిగింది. సోయాతోపాటు మొక్కజొన్న, మినుము పంటల సాగును రైతులు కొంత తగ్గించారు. ఈ సీజన్‌లో వేరుశనగ సాగు అసలే లేదు. ఇప్పటి వరకు రైతులు 63 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారు. మొక్కజొన్న కంకి దశకు చేరుకోగా, వరి గింజలు వచ్చే దశలో ఉన్నాయి. జిల్లాలో 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచే అవకాశముంది.

**క్రాప్ బుకింగ్ ఆలస్యం**

జిల్లాలో సాగవుతున్న పంటల వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు ప్రభుత్వం డిజిటల్ క్రాప్ బుకింగ్ వెబ్‌సైట్‌ను ఇంకా తెరవలేదు. దీంతో పంటల వివరాల నమోదు ఆలస్యమవుతోంది. జూన్‌లోనే ప్రారంభం కావాల్సిన క్రాప్ బుకింగ్ ఇంత వరకు చేయకపోవంతో ఏఈవోలు ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదైతేనే ప్రభుత్వం పంట దిగుబడులు కొనుగోలు చేసేందుకు ఏ విధంగా ముందుకెళ్లాలో అంచనా వేసే అవకాశం ఉంటుంది. క్రాప్ బుకింగ్‌పై త్వరలో ఆదేశాలు వచ్చే అవకాశాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ 'సాక్షి'కి తెలిపారు.



నూత్‌పల్లిలో సాగవుతున్న మొక్కజొన్న

**పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)**

| పంట | గతేడాది | ప్రస్తుత ఏడాది |
|---|---|---|
| వరి | 4,36,101 | 4,36,695 |
| మొక్కజొన్న | 52,829 | 52,093 |
| సోయా | 36,575 | 33,603 |
| పసుపు | 22,941 | 23,611 |
| పత్తి | 1,723 | 1,157 |
| కంది | 673 | 677 |
| పెసర | 41 | 677 |
| మినుము | 110 | 31 |
| వేరుశనగ | 467 | - |



కోమట్‌పల్లిలో సాగవుతున్న వరి

## మరో రెండు రోజులు రైల్వేగేట్ మూసివేత

**డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):** మరమ్మతుల నేపథ్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలోని రైల్వే గేట్‌ను మరో రెండురోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వేశాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అధికారులు తెలిపిన సమాచారం మేరకు 24వ తేదీ రాత్రి 11 గంటల వరకు గేటు మూసివేయాల్సి ఉండేది. అయితే మరమ్మతులు పూర్తికానందున ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రైల్వేగేటు మూసి ఉంటుందని తెలిపారు.





ఎస్సారెస్పీపై పర్యాటకుల సందడి

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పర్యాటకులతో కళకళలాడుతోంది. వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆనకట్టపై గుర్రపు స్వారీ చేస్తూ ఉల్లాసంగా గడిపారు. ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు. – బాల్కొండ

## రెండు సీవోఈ మైనారిటీ కళాశాలలు

**నిజామాబాద్ అర్బన్:** ఉమ్మడి జిల్లాకు మైనారిటీ గురుకులాల విద్యాసంస్థలు(టెమ్రిస్) ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ (సీవోఈ) కళాశాలలు రెండు మంజూరయ్యాయి. టెమ్రిస్ సెక్రెటరీ షఫియుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. నాగారం (బాలుర), ధర్మపురి హిల్స్(బాలికల) సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టెమ్రిస్ ఉమ్మడి జిల్లా బీఎల్‌సీ బాసిర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా మైనారిటీ కేటగిరీకి చెందిన (ముస్లిములు, క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, సిక్కులు) వారితోపాటు నాన్ మైనారిటీ కోటా కింద (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ) అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్ (89857 83112), ఆయేషా (85550 30851), ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి బసీర్ (98494 19469)ను సంప్రదించాలని సూచించారు.



## పక్కా ప్లాన్‌తో ర్యాగింగ్?

- మెడికోపై సీనియర్ల అక్కసు
- జీజీహెచ్ రూమ్ నంబర్ 302లో ర్యాగింగ్, దాడి

**నిజామాబాద్‌నాగారం:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న రాహుల్‌ను హౌస్ సర్జన్ ట్రెయినీలు(సీనియర్లు) పక్కా ప్లాన్ ప్రకారం ర్యాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. నాలుగేళ్లుగా తనపై కక్షగట్టారని, అదునుకోసం ఎదురు చూసి ర్యాగింగ్ చేస్తూ దాడి చేశారని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వ ఆస్పత్రికి సమయానికి చేరుకొని డ్యూటీ చేసినా రిజిస్టర్‌లో అబ్సెంట్ వేశారని, దీనిపై ప్రశ్నించడంతో ఇదే అదునుగా తనను రూమ్ నంబర్ 302లోకి తీసుకెళ్లి రౌండప్ చేశారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు పోలీసులకు చేసిన ఫిర్యాదులు పూర్తి వివరాలు పేర్కొన్నాడు.



**లేబర్ వార్డు వద్ద మొదలై..**

రాహుల్‌ను ముందుగా లేబర్ వార్డు వద్ద బెదిరించిన సీనియర్లు ఆ తరువాత రూమ్‌నంబర్ 302కి పిలిపించారు. అక్కడికి వెళ్లిన రాహుల్‌ను 15 నుంచి 20మంది బూతులు తిడుతూ రాహుల్‌ను రౌండప్ చేశారు. మమ్మల్ని ఎదిరిస్తావా? ఎయిర్ చెయిర్ వేయి.. బయోడేటా చెప్పు అంటూ గంటలపాటు ర్యాగింగ్ చేశారు. తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని రిపోర్టులు చూయించినా పట్టించుకోలేదు. ఒకే సారి ఐదుగురు దాడి చేశారు. రాహుల్ సెలఫోన్ లాక్కుని వాట్సాప్ చాటింగ్ చేశారు. ఇదంతా శనివారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30గంటల వరకు సాగింది.

**విచారణకు కమిటీ**

ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఘటనపై విచారణ చేపట్టేందుకు నలుగురు సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీ వేస్తామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

#### వినాయక చవితి గొడవ అంటూ బుకాయింపు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెడిసిన్ విద్యార్థుల మధ్య ర్యాగింగ్, గొడవ ఘటనలు జరిగినప్పటికీ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, వైద్యులు మాత్రం మెడికోలు వినాయకచవితి పేరుతో రెండు గ్రూపులుగా విడిపోవడంతో గొడవ జరిగిందని బుకాయించారు. ఇంత జరిగినా విషయం బయటికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చివరికు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమపై నాలుగేళ్లుగా కక్షగట్టారని, తాము డే స్కాలర్స్ కావడంతో అక్కసు పెంచుకున్నారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### ఐదుగురు వైద్య విద్యార్థులపై కేసు

- ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ

**ఖలీల్‌వాడి:** ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థి రాహుల్‌రెడ్డిపై దాడి చేసిన ఐదుగురి సీనియర్లపై కేసు నమోదు చేసినట్లు సీపీ సాయిచైతన్య ఆదివారం తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. డే స్కాలర్‌గా కొనసాగుతున్న నగరంలోని వీక్లి మార్కెట్‌కు చెందిన రాహుల్‌ను మొదటి సంవత్సరం నుంచి సీనియర్ అయిన సాయిరాం పవన్ బూతులు తిడుతూ ర్యాగింగ్ చేసేవాడు. ప్రస్తుతం ఫైనలియర్‌లో ఉన్న రాహుల్ ఆస్పత్రిలో డ్యూటీ చేయగా, రిజిస్టర్‌లో అతడికి సాయిరాం అబ్సెంట్ వేశాడు. దీనిపై ప్రశ్నించిన రాహుల్‌ను సీనియర్లు సాయిరాం పవన్, శ్రావణ్, సాత్విక్ హృదయపాల్, అభినవ్ పెద్ది, ఆదిత్య కొట్టడంతోపాటు కాలేజీలో ఎలా ఉంటావో.. ఎలా తిరుగుతావో.. ఎలా పాస్ అవుతావో చూస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. అంతకు ముందు ర్యాగింగ్ చేశారు. వారి నుంచి తప్పించుకుని ఇంటికి వెళ్లిన రాహుల్ తన ప్రాణానికి రక్షణ కల్పించాలని ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్‌రూమ్ 87126 59700కు సమాచారం అందించాలని సూచించారు.

## క్లుప్తంగా

### జిల్లా జైలును సందర్శించిన కవులు



నిజామాబాద్‌ రూరల్‌: దాశరథి రంగాచార్య జయంతిని పురస్కరించుకొని నిజామాబాద్‌ జిల్లా జైలులోని దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని ఇందూరు జిల్లా కవులు సందర్శించారు. దాశరథి రంగాచార్య రాసిన నవలలను గుర్తు చేసుకున్నారు. వారి సాహిత్యాన్ని స్మరిస్తూ జిల్లా కవులు సోదరుడైన కృష్ణమాచార్య జైలుని ఆదివారం సందర్శించి, వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ అష్టావధాని డాక్టర్‌ గణపతి అశోక్‌ శర్మ, ప్రముఖ కవులు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌ రావు, డాక్టర్‌ శారద, తొగరి రాజేశ్వర్‌, చింతల శ్రీనివాస్‌ గుప్తా పాల్గొన్నారు.

### ముప్కాల్‌లో ఈజీఎస్‌ ప్రజావేదిక



బాల్కొండ: ముప్కాల్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో ఆదివారం ఉపాధి హామీ నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వీఎస్‌ఏలు కొన్నాళ్లుగా చేపట్టిన ఆడిట్‌ వివరాలను డీఆర్పీలు చదివి వినిపించారు. మస్టర్లలో కూలీల పేర్లు నమోదు చేయకపోవడంపై తనిఖీల్లో నిర్ధారించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈజీఎస్‌ నిధులపై ఆడిట్‌ చేపట్టారు. కూలీలకు వేతనాలు చెల్లించడంలో, పేర్లు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో సాయాగౌడ్‌ హెచ్చరించారు. ప్రజా వేదికలో ప్రజలు లేకుండానే తూతూ మంత్రంగా వేదికను నిర్వహించారు. కనీసం గ్రామాల్లో కాని, మీడియా పరంగా కాని ఎలాంటి చాటింపు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా ప్రజావేదిక నిర్వహించడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్‌ అధికారి నారాయణ, ఎంపీడీవో బాలగంగాధర్‌ రాజు, ఇన్‌చార్జి ఏపీవో శకుంతల, అంబుడ్స్‌మెన్‌ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానాపై పట్టింపేది..?

- మాణిక్‌బండార్‌లో చీకట్లోనే వైద్య సేవలు
- మురికి కూపాన్ని తలపిస్తున్న ఆస్పత్రి ఆవరణ
- ఇబ్బంది పడుతున్న రోగులు, వైద్య సిబ్బంది



దవాఖానాలోని లోపలిభాగం



అధ్వానంగా ఉన్న మాణిక్‌బండార్‌ పల్లె దవాఖానా పరిసరాలు

మాక్లూర్‌: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని అన్ని రకాల వైద్య సేవలు పల్లెలకు చేరువ చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రారంభించింది. కానీ అందులో కనీస వసతులు లేకపోవడంతో రోగులు, విధులు నిర్వహించే వైద్య సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. మాక్లూర్‌ మండలంలోని మాణిక్‌బండార్‌లో ఉన్న పల్లె దవాఖానా అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ దవాఖానాకు ఏడేళ్లుగా విద్యుత్‌ సరఫరా లేక రోగులు, వైద్య సిబ్బంది ఇక్కట్లు పడుతున్నారు. కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఈ పల్లె దవాఖానాను తండాతోపాటు మాణిక్‌బండార్‌ వాసులు ఉపయోగించుకుంటారు. ప్రతి నిత్యం 20 నుంచి 30 మంది గర్భిణులు, చిన్నాచితక జబ్బులతో బాధపడుతున్న వారు దవాఖానాకు వస్తుంటారు. ఇందులో నలుగురు ఆశవర్కర్లు, ఒక ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు సేవలందిస్తుంటారు. కానీ, దవాఖానాలో కనీస వసతులు లేకపోవడంతో రోగులు, విధులు నిర్వహించే వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ దవాఖానాకు సంబంధిత అధికారులు పలు కారణాల నేపథ్యంలో కరెంట్‌ సరఫరాను నిలిపివేసి ఏడేళ్లు కావొస్తోంది. కానీ, ప్రతి నెలా పాత బకాయితోపాటు ప్రస్తుత బిల్లు రూ.35వేలు వస్తోంది. పాత బకాయి చెల్లిస్తే కానీ విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించే పరిస్థితి లేదని విద్యుత్‌ అధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో చీకటి గదుల్లోనే వైద్యసేవలు కొనసాగుతున్నాయి. మరోవైపు చిన్నపాటి వర్షం కురిస్తే చాలు పల్లె దవాఖానా ఆవరణ మొత్తం మురికి కూపాన్ని తలపిస్తోంది. దీంతో దవాఖానాకు వచ్చే గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దవాఖానా ఆవరణలో పాములు సంచరిస్తున్నాయి. దీంతో వైద్య సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

### రావాలంటేనే భయమేస్తోంది



ఊరి చివరిలో మురికి కాల్వల మధ్య ఉన్న పల్లె దవాఖానాకు రావాలంటేనే భయం వస్తోంది. ఇక్కడ కనీస వసతులు లేవు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు కూడా లేవు.

– నవనీత, గర్భిణి, మాణిక్‌బండార్‌

### ఉన్నతాధికారులకు నివేదించాం

పల్లె దవాఖానాలో అసౌకర్యాలు, కనీస వసతులపై ఉన్నతాధికారులకు నివేదించాం. గతంలో కార్పొరేటర్‌గా ఉన్న రాయ్‌సింగ్‌ దవాఖాన బాగోగులు చూసేవారు. వారి పదవీకాలం పూర్తి కావడంతో పట్టించుకునేవారు లేరు. దీంతో దవాఖాన పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. త్వరలో విద్యుత్‌ సౌకర్యం కల్పిస్తాం.

– డాక్టర్‌ ప్రకాశ్‌, కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

# ఎస్సారెస్పీకి తగ్గిన వరద



వరద గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి 65 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్‌ నుంచి గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు తగ్గించారు. గోదావరిలోకి 8 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీరు పోతుంది. వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3500, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4500, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 651, మిషన్‌ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.90(80.05టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

**మరింత పెరిగిన విద్యుదుత్పత్తి**

ప్రాజెక్ట్‌ వద్ద ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి మరింత పెరిగింది. నాలుగు టర్బయిన్ల ద్వారా 36.5 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ప్రాజెక్ట్‌ నుంచి ఎస్కేప్‌ గేట్ల ద్వారా, కాకతీయ కాలువ ద్వారా కలిపి 8 వేల క్యూసెక్కుల నీట విడుదల కొనసాగుతోంది. ఆదివారం మరింత పెరిగి 36.50 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 9.84మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్‌ తెలిపారు.

# జెండా బాలాజీ ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో జెండాకు పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలో జెండా బాలాజీ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం అర్చకుడు అజయ్‌ సంగ్వాయ్‌ జెండాకు ప్రత్యేక పూజలు చేశారు. శతాబ్దానికి పైగా ఘన చరిత్ర ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను స్థానిక బాసింగ్‌బాబా ఆలయానికి తీసుకొచ్చి వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేపట్టారు. మేళతాళాలతో బయలుదేరి జెండా గల్లీలోని జెండా బాలాజీ ఆలయానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఆలయంలో 15 రోజుల పాటు జాతర జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు శ్రీనివాసుడిని, జెండాను దర్శించుకోవాలని, నిత్యం ప్రత్యేక పూజలతో పాటు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌ విజయ రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ లవంగ ప్రమోద్‌ కుమార్‌, ఆలయ కార్యనిర్వాహణాధికారి గింజుపల్లి వేణు, ఆలయ అర్చకులు నాగరాజు, జూనియర్‌ అసిస్టెంట్‌ ప్రశాంత్‌ కుమార్‌, ధర్మకర్తలు లక్ష్మణ్‌, దేవిదాస్‌, నర్సింగ్‌ రావు, కిరణ్‌ కుమార్‌, విజయ రాజ్‌ కుమార్‌, భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలకు రాయితీలు

- కూరగాయలు, పండ్లు, పూలతోటల సాగులో పందిరి నిర్మాణానికి సబ్సిడీలు
- జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్న అధికారులు



బీరకాయ పంట సాగు కోసం వేసిన పందిరి (ఫైల్‌)

ఆర్మూర్‌: జిల్లాలో కూరగాయలు, పండ్లు, పూల తోటలు పండించే రైతులకు ఉద్యానశాఖ (హార్టికల్చర్‌) అధికారులు రాయితీలు అందజేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతమైన జిల్లాలో రైతులను ఉద్యాన పంటలవైపు ప్రోత్సహిస్తూ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో ఉద్యాన శాఖ తోడ్పాటును అందిస్తోంది. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.

**యాభై శాతం సబ్సిడీపై...**

జిల్లాలో వర్షాకాలంలో సుమారు 800 ఎకరాల్లో, ఎండాకాలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో కూరగాయల పంటలను రైతులు పండిస్తున్నారు. ఇలాంటి రైతులకు సాగును బట్టి రాయితీలను అధికారులు అందిస్తున్నారు. తీగ జాతి (బీర, కాకర, దొండ, పొట్లకాయ, సోరకాయ) లాంటి కూరగాయల పెంపకం కోసం పందిరి సాగు చేసుకోవాలనుకొనే రైతులకు 50 శాతం రాయితీని అందిస్తున్నారు. ఒక రైతు కనీసం అర ఎకరం సాగు చేసుకోవాల్సి ఉంటుంది. అర ఎకరానికి ఉద్యాన శాఖ వారు గరిష్టంగా రూ.50 వేలకు మించకుండా రాయితీని అందజేస్తున్నారు. అదేవిధంగా టమాట, వంగ, మిరప నారును జీడీమెట్లలోని సెంటర్‌ఆఫ్‌ ఎక్సెలెన్స్‌ వారి ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్నారు. ఒక ఎకరానికి ఎనిమిది వేల మొక్కలను తీసుకోవడానికి అవకాశం ఉంది. ఒక్కో రైతు రెండున్నర ఎకరాల్లో ఈ కూరగాయలను పండించడానికి నారును తీసుకోవచ్చును. అదేవిధంగా ఉద్యాన పంటలో వేసుకొనే మల్చింగ్‌ (కప్పు) కోసం 50 శాతం రాయితీ అంటే ఎకరానికి రూ.6400 రాయితీని రైతులకు అందిస్తున్నారు. ఒక్కో రైతు ఐదు ఎకరాల్లో పంటపైన కప్పు కోసం రాయితీ తీసుకోవచ్చును. ఇక మామిడి, జామ, సీతాఫలం, పపాయ, డ్రాగన్‌ ఫ్రూట్‌ లాంటి పండ్ల తోటలు, బంతి, చామంతి, గల్లార్డియా లాంటి ఇతర పూల తోటల సాగును ప్రోత్సహించడానికి ఉద్యానశాఖ వారు 40 శాతం రాయితీని అందజేస్తున్నారు. ఈ రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులు ఉద్యాన పంటల సాగును లాభదాయకంగా మార్చుకోవాలి.

### అదనపు ఆదాయం..



సాంప్రదాయ పంటలతో పాటు అదనపు ఆదాయాన్ని పొందాలనుకొనే రైతులు కూరగాయలు, పండ్లు, పూల తోటలను సైతం పెంచడానికి ఉద్యానశాఖ తోడ్పాటును అందిస్తోంది. అదనపు సమాచా రం కోసం 8977713980 నంబర్‌ను సంప్రదించాలి.

– కే సంధ్యరాణి, హార్టికల్చర్‌ ఆఫీసర్‌, ఆర్మూర్‌

# మోదీపై పోటీ చేసిన ఇస్తారి మృతి

- 2019 పార్లమెంట్‌ ఎన్నికల్లో వారణాసి నుంచి పసుపు రైతుల తరఫున పోటీ



ఇస్తారి (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): పార్లమెంట్‌ ఎన్నికల్లో (2019) ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీపై పోటీ చేసిన పసుపు రైతు సున్నపు ఇస్తారి(78) అనారోగ్యంతో మృతి చెందా రు. పసుపు బోర్డు ఏర్పాటు డిమాండ్‌తో నిజామాబాద్‌, వారణాసి పార్లమెంట్‌ స్థానాల బరిలో పసుపు రైతులు పోటీ చేసిన విష యం తెలిసిందే. పసుపు బోర్డు సాధనే ధ్యేయంగా నాటి ఎన్నికల్లో నిజామాబాద్‌ పార్లమెంట్‌ స్థానం నుంచి వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు 178 మంది రైతులు పోటీ చేశారు. అయితే నరేంద్ర మోదీ పోటీచేస్తున్న వారణాసి నుంచి బరిలో నిలిస్తే తమ డిమాండ్‌ దేశమంతా తెలుస్తుందనే ఉద్దేశంతో నిజామాబాద్‌, జగిత్యాల్‌ జిల్లాల నుంచి 25 మంది రైతులు వారణాసికి వెళ్లి ఆయనపై పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 24 మంది నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా, ఏర్గట్లకు చెందిన సున్నపు ఇస్తారి నామినేషన్‌కు ఆమోదం లభించింది. ఆ ఎన్నికల్లో ఇస్తారికి 787 ఓట్లు వచ్చాయి. నీటి సంఘం చైర్మన్‌గా వ్యవహరించిన ఇస్తారి ప్రధానిపై పోటీ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇస్తారి శనివారం రాత్రి ఆయన ఇంట్లో కన్నుమూశారు. అంత్యక్రియలను ఆదివారం నిర్వహించగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై నివాళులు అర్పించారు.

## గాంధీ పేరును చోరీ చేసింది సోనియా కుటుంబమే

- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



సుభాష్‌నగర్‌: రాహుల్‌గాంధీ ఓట్‌ చోరీ అంటూ డ్రామాలు చేస్తున్నారని, ఇటలీ నుంచి వచ్చి గాంధీ పేరును చోరీ చేసింది సోనియా కుటుంబమే అని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ 11 ఏళ్ల సుపరిపాలన ఓర్వలేక రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని బదనామ్‌ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నగరంలోని శ్రీరామగార్డెన్‌లో సోమవారం నిర్వహించే జిల్లా బూత్‌స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి కోరారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌ రావు, ఎంపీ అర్వింద్‌ ధర్మపురి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌ ఒక గూటి పక్షులని, ఇద్దరూ కులం, వర్గం రాజకీయాలకే పరిమితమయ్యారని విమర్శించారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి, సమగ్రత, సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి, పోతన్కర్‌ లక్ష్మీనారాయణ, రూరల్‌ కన్వీనర్‌ పద్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఖలీల్‌వాడిలో ట్రాఫిక్‌కు చెక్‌



ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఏర్పాటు చేసిన వన్‌వేతో ట్రాఫిక్‌ కష్టాలు తగ్గుతాయని సీపీ పోతరాజు సాయి చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఎంఏ అసోసియేషన్‌, మున్సిపల్‌, డీఎంఅండ్‌హెచ్‌వో లతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ట్రాఫిక్‌ సిబ్బంది వన్‌ వేను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఖలీల్‌వాడి ప్రవేశ మార్గం నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్‌ సర్కిల్‌ ఎంట్రీ వద్ద నుంచి ఉందని, బయటకు వెళ్లాలంటే గ్రంథాలయం ముందు నుంచి, వెల్నెస్‌ హాస్పిటల్‌ పక్కనవున్న నలంద కాలేజీ ముందు, ఇతర మార్గాల నుంచి ఉందన్నారు. వాహన దారులకు వన్‌ వే ఎంట్రీ, ఎగ్జిట్‌ రూట్‌ మ్యాప్‌, ఫ్లెక్సీ లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు, ప్రజలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు.



## క్రైం కార్నర్‌

### చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



కామారెడ్డి క్రైం: క్షణికావేశంలో ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం కొట్టాల్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బచ్చగారి రాజమణి(50) భర్త విఠల్‌ గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. చేసిన అప్పులు తీరలేదు. దీంతో తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. భార్యా భర్తల మధ్య ఆదివారం ఉదయం మరోసారి గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన రాజమణి సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్‌ తెలిపారు.

### రెండు బైకులు ఢీ.. ఒకరికి గాయాలు

మోపాల్‌: మండలంలోని మోతీరాంనాయక్‌ తండా వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై జాడె సుస్మిత ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాల్పోల్‌ తండాకు చెందిన హీరాబాయి నగరంలో నివాసం ఉంటోంది. తండాలో తీజ్‌ వేడుకలు ఉండటంతో యాక్టివాపై వెళ్తుండగా, మోతీరాంనాయక్‌ తండా వద్ద బైరాపూర్‌ శివారులోని పోచమ్మ తండాకు చెందిన బానోత్‌ మంగూరామ్‌ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో హీరాబాయి కాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కామారెడ్డిలో..



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ వద్ద బైక్‌ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో విద్యుత్‌ శాఖలో పని చేస్తున్న ఓ సబ్‌ ఇంజినీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. టాన్స్‌కో జిల్లా కార్యాలయంలోని టెక్నికల్‌ విభాగంలో పని చేస్తున్న దేవీ ప్రసాద్‌ విధుల్లో భాగంగా టేక్రియాల్‌ వైపు వెళ్తుండగా బైక్‌ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు జిల్లా జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

### దాబా నిర్వాహకుడిపై కేసు

గాంధారి: మండల కేంద్రంలోని దాబా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓ దాబాలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా సిట్టింగ్‌ నిర్వహిస్తున్న నిర్వాహకుడు అన్వేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాబాలు, హోటళ్లలో ఎవరైనా అనుమతి లేకుండా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

### మూడు టిప్పర్లు, పొక్లెయిన్‌ సీజ్‌



బాన్సువాడ: బీర్కూర్‌ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లు, పొక్లెయిన్‌ సీజ్‌ చేసినట్లు బీర్కూర్‌ ఎస్సై రాజశేఖర్‌ ఆదివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో మూడు టిప్పర్లను, పొక్లెయిన్‌ ను సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# విద్యుత్‌ తీగలు తగిలి రైతు మృతి



రాజిరెడ్డి (ఫైల్‌)

భిక్కనూరు: దుక్కిదున్నుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్‌ తీగలు తగలకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం నర్సన్నపల్లికి చెందిన చిదుర రాజిరెడ్డి(46) జంగంపల్లి శివారులో ఉన్న రాజంపేట మండలం బస్వన్నపల్లికి చెందిన ఆశిరెడ్డికి చెందిన ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఆదివారం ఆ భూమిని దున్నేందుకు రాజిరెడ్డి తన ట్రాక్టర్‌తో ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. పొలం దున్నుతుండగా బోరు బావికి కనెక్షన్‌ ఇచ్చిన సర్వీస్‌ వైరు ట్రాక్టర్‌కు తగులుతుందని దానిని పైకి లేపే ప్రయత్నం చేశాడు. దీంతో విద్యుదాఘాతం సంభవించడంతో రాజిరెడ్డి ట్రాక్టర్‌పైనే ప్రాణాలు విడిచాడు. కొద్ది సేపటికి అటు వైపుగా వెళ్లిన రైతులు విషయాన్ని గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**జల్లాపల్లి ఫారంలో యువకుడు..**

రుద్రూర్‌: పొతంగల్‌ మండలం జల్లాపల్లి ఫారం కు చెందిన షేక్‌ ముబీన్‌ (30) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సునీల్‌ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ముబీన్‌ తన స్నేహితులతో కలిసి శనివారం చేపలు పట్టేందుకు స్థానిక గ్రామ చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌ తీగ తగిలి కిందపడిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే బోధన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముబీన్‌ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ముస్కాన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అనుమానాస్పదస్థితిలో ఒకరు..

మాక్లూర్‌: మండలంలోని దాస్‌నగర్‌లో చిన్న గంగారాం(60) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్‌ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న గంగారాం గ్రామంలో పనులు చేస్తూ జీవిస్తున్నాడు. భార్య మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. కుమారుడు, కోడలు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా ఆదివారం ఉదయం కుమారుడు తండ్రి గంగారాంకు ఫోన్‌ చేస్తే స్పందించడం లేదని ఇంటి పక్కన ఉన్న వారికి సమాచారం అందించారు. వారు వెళ్లి చూడగా ఇంటి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉందని, కిటికీల నుంచి చూడగా విగతజీవుడిగా ఉన్నట్లు కుమారుడికి సమాచారం అందించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు..



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

బీబీపేట: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్‌ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన పిప్పిరిశెట్టి దేవయ్య శనివారం సాయంత్రం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ మోటారు మరమ్మతుల కోసం బావిలోకి దిగే ప్రయత్నంలో జారిపడ్డాడు. అంతలోనే ఫిట్స్‌ రావడంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఉదయం పొలంలోని బావిలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తుల సహాయంతో నీటిని మోటార్ల ద్వారా తీయించారు. మృతుడి భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్‌



వివరాలను వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్‌

సదాశివనగర్‌: భార్యను బండరాయితో హత్య చేసిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోష్‌కుమార్‌ తెలిపారు. సదాశివనగర్‌ పీఎస్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన చిందం రవి, లక్ష్మి భార్యా భర్తలు. వీరి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున భార్యాభర్త మధ్య గొడవ జరగడంతో కోపోద్రిక్తుడైన రవి భార్యపై బండరాయితో మోది హత్య చేశాడు. హత్యకు ఉపయోగించిన బండరాయిని, మొబైల్‌ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. హత్య కేసును చేధించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై పుష్పరాజ్‌, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

### టీపీడీఈఏ సర్కిల్‌ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



సుభాష్‌నగర్‌: తెలంగాణ పవర్‌ డిప్లొమా ఇంజినీర్స్‌ అసోసియేషన్‌ (టీపీడీఈఏ) నిజామాబాద్‌ సర్కిల్‌ కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌ నరేందర్‌ ఎన్నికల అధికారిగా, సర్కిల్‌ సెక్రెటరీ సంపత్‌ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అంతకుముందు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి రాజేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కంపెనీ జనరల్‌ సెక్రెటరీ నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు హాజరయ్యారు. రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌ నరేందర్‌, కంపెనీ డిప్యూటీ జనరల్‌ సెక్రెటరీ మల్లికార్జున్‌, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తోట రాజశేఖర్‌, కంపెనీ జాయింట్‌ సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, సర్కిల్‌ కార్యదర్శి ఏ కాశీనాథ్‌, కోశాధికారి పి శ్రీనివాస్‌, మహిళా ప్రతినిధి ఆర్‌ సుమిత, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ సాయి తేజ, ఆఫీస్‌ సెక్రెటరీ కెవిఎస్‌ఆర్‌ మూర్తి, డివిజన్‌ సెక్రెటరీలు జి శ్రీనివాస్‌, బల్ల శ్రీనివాస్‌, నాయిని కృష్ణ, శంకర్‌ గౌడ్‌, గంగాధర్‌, కోశాధికారులు భరత్‌, గిరిధర్‌, భరత్‌ కుమార్‌, కాంతారావు, జుబేర్‌, ఏడీఈలు, ఏఈలు, సబ్‌ ఇంజనీర్లు పాల్గొన్నారు.

### టీచర్‌ సస్పెన్షన్‌

నిజామాబాద్‌ అర్బన్‌: నందిపేట మండలం కుద్వాన్‌పూర్‌ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శంకర్‌ను సస్పెన్షన్‌ చేస్తూ డీఈవో అశోక్‌ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థులను కొట్టడం, వారి కళ్లల్లో కారం చల్లడం వంటి ఆరోపణలు రావడంతో ఎంఈవో గంగాధర్‌ చేపట్టిన విచారణ, నివేదిక ఆధారంగా సస్పెన్షన్‌ చేసినట్లు పేర్కొన్నారు.

### గోల్డ్‌షాప్‌కు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

సదాశివనగర్‌: మండల కేంద్రంలోని ఓ గోల్డ్‌ షాప్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బంజ ప్రభులింగం అనే వ్యక్తి గోల్డ్‌షాప్‌ ఫర్నీచర్‌ కోసం ఓ దుకాణంలో పనులు చేపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పనులు జరుగుతున్న షాప్‌లోకి చొరబడి ఫర్నీచర్‌కు నిప్పంటించారు. ఈ ఘటనలో కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ఘటనలో మండల కేంద్రానికి అవుసుల శ్రీధర్‌ పాత్ర కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.